కొల్లేరు విలవిల



సర్కారు కాలువ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు

వరద ఉగ్రరూపం.. పెరుగుతున్న నీటిమట్టం

- ముంపులోనే రోడ్లు.. స్తంభించిన రాకపోకలు
- నిత్యావసర సరుకులకు ప్రజల అవస్థలు
- 1500 ఎకరాల చేపలు, రొయ్యల చెరువుల మునక.. కోట్లల్లో నష్టపోయిన రైతులు

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 10: కొల్లేరు ఉగ్రరూపం కొనసాగుతూనే వుంది. గ్రామాలతోపాటు చేపల, రొయ్యల చెరువుల్లోని కోట్ల రూపాయల విలువైన మత్స్య సంపద ముంపులో కలిసిపోయింది. కైక లూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు నీటిమట్టం మంగళ వారం ముంపు ఆరంగుళాలు పెరిగి 3.46 మీటర్లుగా నమోదైంది. ఇళ్ల చుట్టూ మూడడుగుల మేర నీరున్నా తాగేందుకు నీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా ప్రజలు ఇళ్లల్లోనే మగ్గుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తే కొందరికి పాము కాట్లు తప్పడం లేదు. దీంతో పలువురు ఇప్పటికే ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పెనుమాకలంకకు మోటారు బోట్లకు జనం తాకిడి ఎక్కువైంది. కైకలూరు మండలం నత్త గుల్లపాడు, చటాకాయ్, పందిరిపల్లిగూడెం, కొట్టాడ, పెంచికలమర్రు, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, వడ్లకూటితిప్ప, గుమ్మళ్లపాడుల్లో చేపలు, రొయ్యల చెరువులు ముంపుబారిన పడ్డాయి. లక్ష్మీపురంలో ఆరు ఎకరాల రొయ్యల చెరువు మునిగిపోవడంతో రైతు బోరున విలపించాడు. కైకలూరు, మండవల్లి మండలాల్లో 1500 ఎకరాల్లోని చేపలు, రొయ్యల చెరువులు నీటిపాలయ్యాయి. లక్షలు ఖర్చు పెట్టి సాగు చేస్తున్న రైతులకు వరద దెబ్బ కోలుకోలేని పరిస్థితులకు తీసుకువెళ్లింది. గట్లు ముంపనకు గురికావడంతో చేపలు కొట్టుకుపోకుండా ఆపాలు, ఐరన్ మెస్‌లతో అడ్డుకట్టు వేస్తున్నారు. సన్న, చిన్న కారు రైతులు ఇసుక బస్తాలతో గట్లు ఎత్తును పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు రైతులు హడావుడిగా పట్టు బడులు చేసి నష్టాలను చవిచూస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా నీట మునిగాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆలపాడు నుంచి కొల్లేటి కోటకు వెళ్లే రహదారిలో పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, సర్కారు కాలువ నుంచి పందిరిపల్లిగూడెం వరకు రహదారి పూర్తిగా ముంపులో ఉంది. కొట్టాడకు వెళ్లే ప్రధాన రహదారి మంగళవారం ముంపునకు గురైంది. పశువులను కట్టే చోటు లేకపోవడంతో వరద నీటిలోనే జీవిస్తున్నాయి. తినేందుకు పశుగ్రాసం అందుబాటులో లేదు. కొల్లేరులో రోజూ మేతమేసే పశువులకు ముంపు రావడంతో పశువులను రైతులు ఇళ్ల వద్దే బంధించారు. ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి అడ్డుగా వున్న గుర్రపు డెక్క, కిక్కిస కర్ర తొలగింపు పనులు నిర్విరామంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, కనుమూరి రఘురామకృష్ణరాజు పర్యవేక్షణలో రెండు ఎక్స్‌కవేటర్లకు లాంగ్ స్టిక్స్‌ను ఏర్పాటుచేసి పనులు చేపట్టారు. ఉప్పుటేరులో రైల్వే బ్రిడ్జి, రోడ్డు బ్రిడ్జి వల వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా వున్న వాటిని తొలగిస్తే కొల్లేరులో నీరు వేగంగా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళుతుంది. ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహించడంతో పరివాహక ప్రాంత ప్రజలు, ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



పెద్దఎడ్లగాడి వద్ద కిక్కిరిసిన నాటు పడవ



కొల్లేటి చుట్టూ నీరు.. మధ్యలో పశువులు



ముంపులో ఆటపాక పక్షుల కేంద్రం

ఆటపాక పక్షుల కేంద్రానికి చెందిన 310 ఎకరాల చెరువు పూర్తిగా కొల్లేరులో కలిసిపోయింది. మత్స్య సంపద కొల్లేటి పరమైంది. పక్షుల కేంద్రంలోని పర్యావరణ విద్యా కేంద్రం, ప్రధాన ముఖద్వారం వద్ద టిక్కెట్ కౌంటర్ మునిగిపోయాయి. దీనితో పర్యాటకులకు అనుమతిని నిషేధించారు.

జలదిగ్బంధంలో మొండికోడు, గుడివాకలంక

ఏలూరు రూరల్ : మొండికోడు, గుడివాకలంక, కోమటి లంక గ్రామాలకు వెళ్లే రహదారిపై కొల్లేరు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఓ వైపు బుడమేరు, మరోవైపు తమ్మిలేరు, ఇంకోవైపు రామిలేరు ఇలా అన్ని వాగుల నుంచి వచ్చిన వరద కొల్లేరును చుట్టుముట్టింది. వరద ఉధృతి రహదారులపై ప్రవహిస్తూ ఉండటంతో ఆ మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఉధృతిని తగ్గించి తమను కాపాడాలని మంగళవారం గుడివాకలంకలో గంగమ్మ తల్లికి మత్స్యకార మహిళలు పూజలు చేశారు. ఉదయం ఆర్డీవో ఎస్.కె ఖాజావలీ, మాదవపాలెం రహదారిపై ప్రవహిస్తున్న వరదను పరిశీలించారు.

ముంపునకు అడ్డుకట్ట

నిడమర్రు : అడవికొలనుకు మంగళవారం సాయంత్రం కొల్లేరు వరద సమీపించింది. అడవికొలను సత్యనారాయణపురం సమీపంలో గల తూముల వరకు వరదపైకి పొడవడంతో రైతులు కంగారుపడి వరి చేలలోకి వరద నీరు రాకుండా కాలువలకు అడ్డుకట్ట వేస్తున్నారు. నీటి సంఘం అధ్యక్షులు కోటిపల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 200 మంది రైతులు రెండు వేల ఖాళీ సిమెంటు సంచుల్లో మట్టిమూటలు కట్టి వరదనీరు గ్రామంలోకి రాకుండా చర్యలు చేపడుతున్నారు.



బాధితులను ఆదుకుంటాం : ఎంపీ పుట్టా

కైకలూరు : కొల్లేరు వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆలపాడు శివారు సోమేశ్వరం వద్ద ఉప్పుటేరును పరిశీలించారు. కొల్లేరు ప్రజలు ముంపు బారిన పడినప్పటికీ ఆందోళన చెందవద్దని, ఎవరికీ ఏ విధమైన నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడతామన్నారు. ఎగువన డ్రెయిన్లు పొంగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీకేఎం నాని, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులైనా.. వదలని వరద



వేలేరుపాడు, రేపాకగొమ్ము రహదారిపై చేరిన వరద

మూడోసారి ముప్పు ముంగిట కుక్కునూరు, వేలేరుపాడు

- శబరి ఉధృతి.. రికార్డు స్థాయిలో నీటిమట్టం
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- మూడో ప్రమాద హెచ్చరిక దిశగా ప్రవాహం
- ముంపు ముంగిట 34 గ్రామాలు
- సహాయ శిబిరాలకు చేర్చేందుకు ఏర్పాట్లు
- కూరగాయలు, నిత్యవసరాలు సిద్ధం
- గర్భిణులు, చంటి పిల్లలు, వృద్ధుల తరలింపు
- వైద్య, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం
- రెండు మండలాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటన : ముందస్తు చర్యలకు ఆదేశం



కుక్కునూరు : సీతారామనగరం రోడ్డుపైకి వరద రావడంతో నిలిచిన రాకపోకలు

(ఏలూరు/కుక్కునూరు/వేలేరుపాడు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గోదావరిలో వరద వంద రోజులుగా మూడు సార్లు ఉప్పొంగింది. తెలంగాణలో భారీ వర్షాలు పడినప్పుడు జూలైలో తొలిసారి వరద పెరగడంతో కుక్కునూరు, వేలేరుపాడు రెండూ మునిగిపోయాయి. మరోమారు అదే జరిగింది. ఇప్పుడు మూడోసారి 34 గ్రామాల చుట్టూ వరద చేరింది. రాబోయే 24 గంటల్లో మరిన్ని గ్రామాలు నీట మునిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గోదావరి గంట గంటకు పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. 48 గంటల క్రితమే తగ్గినట్టే తగ్గి మళ్లీ విజృంభించింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తీవ్రంగా ఉండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మధ్యప్రదేశ్, ఒడిశా మీదుగా పోలవరం ఎగువ ప్రాంతంలో ఉప నది శబరి పోటెత్తింది. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా ఇది 44 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. దీని పరివాహ ప్రాంతంలోని చింతూరు, వీఆర్.పురం, కూనవరం మండలాలు ఇప్పటికే నీట మునిగాయి. శబరి, గోదావరి సంగమం కూనవరం వద్ద అత్యంత ప్రమాదకర స్థితిలో పోటెత్తుతోంది. శబరి వరదకు చత్తీస్‌గఢ్ అడవుల నుంచి వచ్చే తాలిపేరు నుంచి లక్ష క్యూసెక్కుల వరద గోదావరిలోనే కలుస్తోంది. ఈ కారణంగా కుక్కునూరు మండలం సీతారామనగరం వెళ్లే రహదారి గోదావరి వరదకు నీట మునిగింది. ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం రహదారి పలుచోట్ల ముంపునకు గురైంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 34 గ్రామాల పరిసరాలకు వరద నీరు చేరింది. ఇప్పుడున్న మట్టం 51 అడుగులకు చేరితే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వరద వచ్చిన 48 గంటల్లోనే గోదావరిలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో భద్రాచలం వద్ద వరద 50 అడుగులకు చేరుకుంది. మరో మూడడుగులు పెరిగితే మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. తెల్లవారుజాము నాటికి ఇది కాస్తా 53 అడుగులు దాటవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. గొమ్ముగూడెంలోని నిర్వాసితులను దాచారం పునరావాస కాలనీకి తరలించారు. కౌండిన్య ముక్తిలో 60 కుటుంబాలను, పాత అమరవరం నుంచి 15 కుటుంబాలను పునరావాస కాలనీలకు తరలించారు. పునరావాస కాలనీలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు. మండలంలోని దాదాపు 500 ఎకరాల్లో మిర్చి పంట నీట మునిగింది. మిర్చితోపాటు పత్తి, వరి రైతులు నష్టపోయారు.



కలెక్టర్ ముందు బాధితుల గోడు

నిర్వాసితుల పాట్లు

పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేసిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని కుటుంబాలు తరచూ పునరావాస కేంద్రాలకు వెళ్ళాల్సి వస్తోంది. జూలైలో ఒక్కసారిగా వరద పోటెత్తి 54.4 అడుగుల మేర ప్రవాహ ఉధృతి రికార్డు అయ్యింది. అప్పట్లో 34 గ్రామాలు నీట మునిగాయి. ప్రజలను కాపాడేందుకు యంత్రాంగం సర్వశక్తులు ఒడ్డింది. ప్రాణాపాయం లేకున్నా, ఆస్తి పాస్తులకు భారీ నష్టమే జరిగింది. ఇప్పటికే ముంపు ప్రాంతాలుగా వున్న ఆయా గ్రామాల ప్రజలు అక్కడి నుంచి జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో కొత్తగా నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోకి చేరాల్సి ఉంది. ఉన్న ఊరును వదులుకోలేక జీలుగుమిల్లిలో నిర్మించిన కాలనీల్లో బతుకుతెరువు లేని స్థితిగతులను తట్టుకోలేక ఇప్పటికీ గోదావరి వరదను ఎదురీదుతూనే ఉన్నారు. ఆగస్టులో మరోమారు గోదావరి ఉరకలేసింది. అప్పట్లో 44.4 అడుగుల మేర వరద ఉధృతి పెరగడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆ నెలలో పలు గ్రామాల ప్రజలను ముందస్తుగా తరలించారు. దీని నుంచి కోలుకోక మునుపే ఇప్పుడు మూడోసారి గోదావరి తరుము కొచ్చింది.

మూడు నెలలు భయం భయం

దశాబ్దకాలంగా ఆగస్టు నుంచి అక్టోబరు వరకు ఈ మూడు నెలలు వరద భయం వెంటాడుతోంది. భద్రాద్రి వద్ద నీటి మట్టం నిలకడగా ఉండి తర్వాత క్రమేపీ పెరగడం, ముందస్తు వరదను అంచనా వేసి ఎక్కడికక్కడ సర్దుకోవడం ఇంతకు ముందు జరిగేది. ఇప్పుడు ఆ రికార్డులన్నింటినీ చెరిపేసి 24 గంటల వ్యవధిలోనే గోదావరిలో నీటిమట్టం 48 అడుగులకు పైగా దాటిపోయింది. ఇలాంటి అనూహ్య పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు అంచనా వేయలేదు. కారణం గోదావరి ఉప నదుల నుంచి రికార్డుస్థాయిలో వరద ముంచుకొచ్చి గోదావరిలో కలవడంతో ఈ పరిస్థితి దాపురించింది. 2022లో గోదావరికి వరదలు భారీ స్థాయిలో వచ్చాయి. అప్పట్లో భద్రాద్రి వద్ద ఏకంగా వరద నీటి మట్టం 74 అడుగులకు పైగా రికార్డు అయ్యింది. ఇలాంటి రికార్డు స్థాయిలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అనేక గ్రామల్లో దాదాపు 8 నుంచి 12 అడుగులకుపైగానే వరద నీరు ప్రవహించింది. రోజుల తరబడి విద్యుత్ సరఫరా చేయలేకపోయారు. వందలాది విద్యుత్ స్తంభాలు నీట మునగడం, ఆ తర్వాత నేలకొరగడం వంటి పరిణామాల నేపథ్యంలో అప్పటి జగన్ సర్కార్ అతి కష్టం మీద విద్యుత్‌ను పునరుద్దరించగలిగింది. ఆయన వేలేరుపాడు మండలంలో తూతూమంత్రంగా పర్యటించారు. పది వేలకు తగ్గకుండా పరిహారం ఇస్తానని ప్రకటించారు. అది బాధితుల ఇంట చేరనేలేదు. జగన్ వచ్చి వెళ్ళిన మరుసటి రోజే అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వ నిస్సహాయ స్థితిని, బాధితుల ఆర్తనాదాలను ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్వాసితులకు తన అండ ఉంటుందని బాబు ప్రకటించారు.

వరదలు తగ్గే వరకు పునరావాస కాలనీల్లోనే ఉండండి : కలెక్టర్

అధికారులు ఊపిరి పీల్చుకోక మునుపే గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చడంతో ముంపు మండలాల్లో సహాయ శిబిరాలను వేగవంతం చేశారు. కుక్కునూరు మండలం దాచారం, వేలేరుపాడు మండలం తాటుకూరుగొమ్ము గ్రామాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి బాధితులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరద పూర్తిగా తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లో ఉండాలని బాధితులను కోరారు. వరదల కారణంగా తాము సర్వం కోల్పోయామని నిత్యావసరాలు అందించాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని బాధితులు కోరారు. పునరావాస కేంద్రంలో భోజన వసతి కల్పిస్తామని గ్రామాలకు తరలి వెళ్ళే సమయంలో నిత్యావసర సరుకులు అందిస్తామని కలెక్టర్ వారికి తెలిపారు. వింజరం, ముత్యాలంపాడు గ్రామాల్లో వరద ముంపునకు గురైన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా ఏటా వరదల వల్ల కంటి మీద కునుకు లేకపోతోందని, రెండు నెలల్లో మూడుసార్లు గోదావరి వరదల కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఇంకెన్నాళ్లు బాధలు పడాలని మహిళలు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. ఎనిమిదేళ్లుగా వరదలకు ఎంతో నష్టపోతున్నామని తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లిస్తే పునరావాస కాలనీలకు తరలిపోతామని వేదన వినిపించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పోలవరం పునరావాస ప్యాకేజీ ఇచ్చి కాలనీలకు పంపించే ఏర్పాట్లు చేస్తామని, కొంత కాలం ఓపిక పట్టాలని గ్రామస్థులకు సూచించారు. ఆర్డీవో కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాబ్జి, తహశీల్దార్ చలపతి, తదితరులు పాల్గొన్నారు.




నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రభుత్వ పాఠశాలలకు రూ.1.10 కోట్ల నష్టం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : ఇటీవల ఎడతెరిపి లేని భారీ వర్షాల తాకిడికి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు దెబ్బ తిన్నట్టు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టుకు నివేదిక అందింది. ముఖ్యంగా భవనాల పైకప్పు శ్లాబ్‌లు వర్షపు నీటితో లీకవుతున్నట్టు ఎంఈవోలు ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ మేరకు జిల్లాలో పాఠశాలల భవనాల కండిషన్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని మండలాల నుంచి క్షేత్ర స్థాయి వివరాలను సేకరించారు. జిల్లాలో మొత్తం 62 పాఠశాలల భవనాల రూఫ్ శ్లాబ్‌ల నుంచి నీళ్ల లీక్ అవుతున్నట్టు తేల్చారు. మరమ్మతుల నిమిత్తం ఒక్కో భవనానికి సుమారు రూ.2 నుంచి 3 లక్షలు అవసర మవుతాయని అంచనాలను స్కూలు హెచ్‌ఎం/ఎంఈవో పంపారు. దీనికోసం మొత్తం రూ.1.10 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా. వర్షాల వల్ల ప్రభుత్వ పాఠశాలల భవనాలకు వాటిల్లిన నష్టం, మరమ్మతుల నిమిత్తం అవసరమయ్యే నిధుల కోసం రూపొందించే నివేదికను ప్రభుత్వానికి పంపించే అవకాశం ఉంది.

నేడు కొల్లేరులో సీఎం చంద్రబాబు ఏరియల్ వ్యూ



- 11 గంటలకు దుంపగడపలో ఉప్పుటేరు పరిశీలన.. అధికారుల ఏర్పాట్లు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 10 : బుడమేరు పోటెత్తి విజయవాడ నగరాన్ని ముంచెత్తిన నీరంతా దిగువున ఉన్న కొల్లేరుకు పాకింది. కొల్లేటి సరస్సులో నీటి నిల్వ సామర్థ్యం మూడు టీఎంసీలు ఉండగా దీనికి మించి వరద కొల్లేరులోకి చేరడం, పెద్ద సంఖ్యలో లంక గ్రామాలు ముంపులో చిక్కుకుని భారీ నష్టాన్ని చవిచూశారు. చేపల చెరువులు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాలకు ప్రజలు పడవల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ తరుణంలో కైకలూరు పరిధిలో నష్టపోయిన కొల్లేరు ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు బుధవారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించనున్నారు. ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం హెలికాప్టర్‌లో బయలుదేరతారు. 10.50 గంటలకు కొల్లేరులో ఏరియల్ సర్వే చేస్తారు. 11 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం భీమవరం రోడ్డులో వి కన్వర్షన్ ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగి, 11.30 గంటలకు దుంపగడప సమీపంలోని ఉప్పుటేరు బ్రిడ్జి కొల్లేరు అవుట్ లెట్ డ్రెయిన్‌ను పరిశీలిస్తారు. 12 గంటలకు రోడ్డు మార్గంలో హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో కాకినాడ జిల్లాకు వెళతారు. సీఎం పర్యటన ఏర్పాట్లను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ ఆస్మి మంగళవారం అర్ధరాత్రి వరకు ఏర్పాట్లపై సమీక్షించారు. ఏలూరు జిల్లా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల కేంద్రంగా విద్య

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల కార్యకలాపాలను, విద్యాభివృద్ధి కార్యక్రమాలపై పర్యవేక్షణ, సమీక్షకు ఉద్దేశించిన స్కూల్ కాంప్లెక్స్‌లకు ఇక కొత్తరూపు తీసుకురావడానికి వాటిని పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మంగళవారం ఏలూరు జిల్లా ఎంఈవోలతో డీఈవో అబ్రహం నిర్వహించిన సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్‌లకు నూతన రూపుపై స్పష్టతనిచ్చారు. ఇప్పటి వరకు ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు ఏటా రూ.22 వేలను నిర్వహణ నిమిత్తం నిధులను ఇచ్చేవారు. ఈ నిధులనే కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సమానంగా పంచేవారు. ఒక్కో మండలంలో కాంప్లెక్స్‌లు నాలుగు నుంచి ఏడు వరకు పాఠశాలల సంఖ్య ఆధారంగా ఉన్నాయి. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 12 నుంచి 14 వరకు పాఠశాలలున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన క్రమంలో స్కూల్ కాంప్లెక్స్‌లను కేంద్రంగా తీసుకుని అన్ని విద్యా కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇకమీదట ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.లక్షల్లోనే నిర్వహణ నిధులను పెంచడంతోపాటు, మండలంలో కనీసం మూడెకరాల విస్తీర్ణం వున్న పాఠశాలనే కాంప్లెక్స్‌గా ఎంపిక చేసి, అక్కడ అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఆడిటోరియంను నిర్మించను న్నారు. ఇందులో కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడం, టీచర్లకు అవసరమైన శిక్షణ, వర్చువల్ మీటింగ్‌లు, విద్యార్థులకు పంపిణీ చేసే పుస్తకాలు తదితర సామగ్రిని భద్రపర్చేందుకు వీలుగా భవనాన్ని నిర్మించనున్నారు.

శాంతించిన వరుణుడు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 10 : వరుణుడు శాంతించాడు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 4.4 మి.మీ. కుక్కునూరు 8.8, ఏలూరు రూరల్ 7.8, ఏలూరు అర్బన్ 7.4, బుట్టాయిగూడెం 6.2, జీలుగుమిల్లి 5.8, చింతలపూడి 5, లింగపాలెం 4.8, కొయ్యలగూడెం 4.8, పోలవరం 4.4, జంగారెడ్డిగూడెం 4.4, దెందులూరు 4.2, కలిదిండి 4.2, పెదవేగి 4, కైకలూరు 4, నిడమర్రులో 4 మి.మీ వర్షపాతం నమోదైంది.

తమ్మిలేరుకు తగ్గిన వరద

చింతలపూడి, సెప్టెంబరు 10 : నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దిగువకు తక్కువ నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మంగళవారం సాయంత్రం ప్రాజెక్టు నీటిమట్టం 346.53 అడుగులు ఉంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1926 క్యూసెక్కులు వస్తోంది. అవుట్‌ఫ్లో 852 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గట్టు జారిపోతోంది..


ప్రగడపల్లి వద్ద కోతకు గురైన పోలవరం కుడి కాలువ

పోలవరం సెప్టెంబరు 10 : ఎగువ రాష్ట్రాల నుంచి కలుస్తున్న వరద జలాలు, కొండవాగుల జలాలతో గోదావరి నీటి మట్టం మంగళవారం నాటికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 10,39,627 క్యూసెక్కుల నీటిని దిగువకు విడు దల చేశారు. ఎల్లండీపేట కొవ్వాడ రిజర్వాయర్ నుంచి సోమవారం రాత్రి 480 క్యూసెక్కులు, ఉదయం 360 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్ నీటిమట్టం 89.70 మీటర్లు నమో దైనట్లు రిజర్వాయర్ సిబ్బంది సత్యనారాయణ తెలిపారు. కొవ్వాడ వరద జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కల్వర్టుల నుంచి వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువపై ప్రగడపల్లి గ్రామం వద్ద నిర్మించిన కొవ్వాడ కాలువ అక్విడెక్టు నుంచి ప్రవహించిన కొవ్వాడ కాలువ, కొండవాగుల జలాల దాటికి ప్రాజెక్టు కుడి కాలువ కోతకు గురైంది. వింజరం పంచాయతీ తానాలకుంట జంక్షన్ వద్ద ఉన్న కల్వర్టు కొండవాగుల దాటికి ప్రమాద స్థాయిలో కోతకు గురైంది, దీంతో పోలవరం నుంచి ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే వాహనాల రాకపోకల నిలిచిపోయాయి.


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న దినేష్ శంకర్‌రెడ్డి

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 10 : గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, విజ్ఞానానికి ఆలయాలని అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో గ్రంథాలయాన్ని ఎక్కువగా వినియోగించు కుంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బిబ్లీ అవార్డులను ప్రకటించారు. ఈ మేరకు 2023-24 సంవత్సరానికి సంబంధించి ఏపీ నిట్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో సివిల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవ త్సరం చదువుతున్న విద్యార్థులు సంతోనా నాయక్, బీ.జయేష్ గిరీష్‌లకు బిబ్లియోఫిల్ అవార్డులు అందజేశారు. దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం వేల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతీ ఏడాది ఆరు నెలలకు ఒకసారి బిబ్లియోఫిల్ అవార్డులను అందజేస్తామన్నారు. డీన్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి, గ్రంథాలయ చైర్ పర్సన్ డాక్టర్ చేబ్రోలు శ్రీలత,అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి పాల్గొన్నారు.

'ఇగ్నో' ప్రవేశాలకు గడువు 15

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో 2024 జూలై కేలండర్ ఇయర్‌లో వివిధ దూరవిద్యా కోర్సులు, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సీఆర్‌ఆర్ కళాశాల 'ఇగ్నో' స్టడీసెంటర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు, ఐదురకాల ఎంబీఏ కోర్సుల్లోకూడా అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. ఈ నెల 15 వరకు గడువు ఉందని వివరించారు. వివరాలకు 94903 50469లో సంప్రదించాలని కోరారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు 15

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూర విద్య పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్లకు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 25వరకు గడువు ఉందని వివరించారు.

అరటి ఉత్పత్తుల తయారీపై శిక్షణ



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: అరటి మొక్కల నుంచి వచ్చే డొప్పల నుంచి పలు ఉత్పత్తుల తయారీపై వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ మంగళవారం రెండో రోజు కొనసాగింది. అరటిడొప్పల నుంచి నారు తీసి మిగిలిన గుజ్జును ప్లేట్లు, కాగితం తయారు చేయవచ్చని శాస్త్ర వేత్తలు వివరించారు. శిక్షణలో ఉద్యాన విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ, శాస్త్రవేత్తలు కె.వెంకట సతీష్, ఎస్‌.ప్రశాంత్, కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవండి : ఎంపీ మహేష్


చంద్రబాబుకు చెక్ అందిస్తున్న ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు అండగా నిలవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. సీఎం సహాయనిధికి రూ.25 లక్షల చెక్కును విజయవాడలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు మంగళవారం అందజేశారు. ప్రతీ ఒక్కరు తమకు తోచిన సహాయాన్ని బాధితులకు అందించాలన్నారు. అనంతరం విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

వరద ప్రభావిత పంచాయతీలకు పవన్ కల్యాణ్ చేయూత

ఏలూరు జిల్లాలో 90 పంచాయతీలకు రూ.90 లక్షలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 10: డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వర్షాలు, వరదల కారణంగా నీట మునిగిన గ్రామ పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున విరాళం ప్రకటించటంపై ఆయా పంచాయతీల గ్రామ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విపత్తులు వచ్చిన సమయంలో సీఎం సహాయ నిధికి విరాళాలు ఇవ్వడం సహజం. కానీ వ్యక్తిగతంగా పంచాయతీలకు సాయం ప్రకటించడంపై అంతా అభినంది స్తున్నారు. రాష్ట్రంలో వరద ప్రభావిత గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచా యతీకి లక్ష రూపాయలు చొప్పున 400 గ్రామ పంచాయతీలకు రూ.4 కోట్లు విరాళంగా అందించటం ఎక్కడా జరగలేదని చెబుతున్నారు. జిల్లాలో వరద ప్రభావానికి గురైన 90 గ్రామ పంచాయతీలకు పంచాయతీకి లక్ష చొప్పున మొత్తం రూ.90 లక్షలు విరాళంగా అందించనున్నారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలకు ఆయన కోటి రూపాయలు చొప్పున విరాళం ప్రకటించారు. వరద ముంపు ప్రభావిత గ్రామాల వివరాలు, డొనేషన్ జమ చేయాల్సిన పంచాయతీ అక్కౌంట్ నంబర్ల వివరాలు సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సూచించింది. ఏలూరు జిల్లాలో 90 గ్రామ పంచాయతీలు వరద ప్రభావిత గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. ఆయా గ్రామ పంచాయతీల అక్కౌంట్ నంబర్లు అందజేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ నిధులను జిల్లాలోని ప్రజా ప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యేలచే పంపిణీ చేస్తున్నారు.

నియోజకవర్గం	ముంపుగ్రామాలు	విరాళం (లక్షల్లో)
నూజివీడు	23	23,00,000
దెందులూరు	14	14,00,000
కైకలూరు	6	6,00,000
చింతలపూడి	13	13,00,000
పోలవరం	28	28,00,000
గోపాలపురం	6	6,00,000
మొత్తం		90,00,000



ఆంధ్రజ్యోతి ఫోకస్

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి..

అధ్వాన రోడ్లపై అవస్థలు


ఏలూరులో తంగెళ్లమూడి వద్ద గోతుల్లో నీటిని తోడిపోస్తున్న దృశ్యం


ఏలూరు ఎమ్మార్సీ కాలనీలో..

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 10 : : ఏలూరు నగరంలోని అంతర్గతరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగు తీసి అడుగు వేయాలంటే భయపడుతున్నారు. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంతల రోడ్లన్నీ గోతులు పడి నీళ్ల నిలిచిపోయాయి. వాహనదారులు గుంతల్లో పడి నడుములు విరగ్గొట్టుకుంటున్నారు. గన్‌బజారు నుంచి తంగెళ్ళమూడి వైపు వచ్చే రోడ్డు నరకప్రాయంగా తయారైంది. తంగెళ్ళమూడిలో అన్నాక్యాంటీన్ దగ్గర బేకరి ఎదురుగా ఉన్న రోడ్డు పెద్దపెద్దగుంతలుపడి నీటితో నిండిపోయింది. అది పెద్ద మలుపు కావడంతో ఆ రోడ్లపై వచ్చే టూవీలర్, త్రీవీలర్స్ మలుపు తిరగగానే గోతుల్లో పడిపోతున్నారు. లునానినగర్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు నరకప్రాయంగా తయారైంది. చీకట్లో వెళ్ళే వారికి అక్కడ లైట్లు కూడా లేకపోవడంతో గోతుల్లోపడి వాహనదారులు కాళ్ళు, చేతులు విరగ్గొట్టుకుంటున్నారు. నగరం నడిబొడ్డు అశోక్‌నగర్ బ్రిడ్జీ వద్ద నాలుగు రోడ్ల కూడలి రోడ్డులోకి వెళ్ళాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రోడ్లన్నిటిని అభివృద్ధి పరిచి నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. గోతులు పడిన రోడ్లపై ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవు తున్నారు.

పెనుమంట్ర : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. బ్రాహ్మణ చెరువు- వీరవాసరం, బ్రాహ్మణ చెరువు -పొలమూరు నవుడూరు సెంటర్ ప్రాంతాల్లో గోతుల ఏర్పడ్డాయి దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అలాగే పెనుగొండ-నరసాపురం రహదారిపై మార్టేరు శివరావుపేట కనక దుర్గమ్మ ఆలయం వరకు రోడ్డు గోతులమయం అవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్లపై ప్రజల పాట్లు

ఇరగవరం : భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. రహదారులపై గోతుల్లో నీరు చేరడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. మండలంలోని అయితంపూడి ప్రధాన రహదారి, ఏలేటిపాడు-ఇరగవరం రహదారులపై తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ రహదారుల నిర్వహణ గాలికొదిలేసిందని, కనీసం గోతులైనా పూడ్చండంటూ అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

గేటు దాటాలంటే గుండె గుభేలు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణంలో భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటు దాటాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసిందే. భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటుకు (ఇరువైపులా) స్పీడు బ్రేకర్లు నిర్మించారు. దానికి 10 అడుగుల దూరంలో మరో స్పీడు బ్రేకర్ నిర్మించారు. స్పీడు బ్రేకర్లు దాటాలంటే చిన్న కార్ల కింది భాగం తగిలి చొట్టలు పడు తున్నాయి. ఇక బైక్‌లపై వెళ్ళేవారికి నడుములు పట్టి నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పీడు బ్రేకర్లకు తోడు అదే ప్రాంతంలో పెద్ద పెద్ద గొయ్యిలు కూడా పడటంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. బైక్‌లపై వెనక సీటులో కూర్చున్న మహిళలు జారిపడటంతో చేతులు విరిగిన సంఘటనలు ఇటీవల రెండు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్ల ఎత్తు తగ్గించడంతో పాటు రోడ్డుపై గోతులను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు. ఈరోడ్డు వెంబడి రోజు సుమారు 800 వాహనాలు, 3000 వరకూ బైక్‌లు తిరుగుతుంటాయి.


గోతులమయంగా ఏలేటిపాడు-ఇరగవరం రహదారి


పాలకొల్లు రైల్వే గేటు వద్ద గోతులు పడిన రోడ్డు


మార్టేరులో గోతులు మయంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

స్కీమ్ పేరుతో ముంచేశారు

వారానికి రూ.40..కడితే ఆకర్షణీయమైన బహుమతులు
చివరిలో ముఖం చాటేసిన నిర్వాహకులు
తాడేపల్లిగూడెంలో బయటపడిన మోసం



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: తాడేపల్లిగూడెంలో స్కీమ్ పేరుతో నయామోసం తెరమీదకు వచ్చింది. వారానికి రూ.40 కడితే ప్రత్యేక బహుమతులు అంటూ ఆకర్షించారు. వారం వారం రూ.40 పెంచుకుంటూ 32 వారాల పాటు చెల్లించాలి. ఈ స్కీమ్‌లో మొదటి నెలలో తక్కువ ఖరీదు ఉన్న వస్తువులను ఎరవేసి వందల సంఖ్యలో స్థానికులను చేర్చుకుని చివరికి వస్తువులు ఇవ్వాల్సిన సమయంలో చేతులెత్తేశారు. దీంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తాము మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. స్కీమ్ వ్యవహారం మంగళవారం ఆ నోటా ఈనోటా బయట పడి చివరికి నిర్వాహకులను నిలదీస్తే వస్తువులు వస్తాయంటూ మరో కథ చెప్పడం ప్రారంభించారు. దీంతో స్కీమ్ కట్టిన వారు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

లక్షల్లో మోసం..

ఈ స్కీమ్‌లో మొదటివారం రూ.40 చెల్లించాలి. తరువాత వారం మరో 40 పెంచి రూ.80 కట్టాలి. ఇలా మొత్తం 32 వారాల పాటు పెంచుకుంటూ వెళితే లక్షల్లో సొమ్ము జమవుతుంది. ఈ స్కీమ్‌లో 500 మంది సభ్యులు ఉంటే చివరికి మిగిలిన 150 మంది సభ్యులకు ఇన్వర్టర్ అందించాల్సి ఉంది. ఈ స్కీంలో చిన్న చిన్న వస్తువులు గెలుచుకున్న సభ్యులకు వస్తువులు ఇచ్చిన నిర్వాహకులు పెద్ద వస్తువులు గెలుచుకున్న వారికి మొండిచేయి చూపించారు. దీంతో సొమ్ములు కట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. ఈ తరహా స్కీమ్‌లలో ఒక్కొ స్కీమ్ 500 మంది చొప్పున సభ్యులను చేర్చుకుని లాటరీ తీస్తుంటారు. పదుల సంఖ్యలో ఇలాంటి స్కీమ్‌లు నిర్వహించి ప్రజలను మోసం చేస్తున్నారు. ఒక్కొ స్కీమ్ ద్వారా లక్షల్లో లాక్కుని వేలలో వస్తువులు అప్పగించి ప్రజలను మోసగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రౌడీయిజం చేస్తున్నారు



స్కీమ్ పేరుతో ప్రజలను ఆకర్షించి తీరా పూర్తయిన తరువాత ముఖం చాటేస్తున్నారు. మూడు నెలల నుంచి తిరుగుతున్నా కట్టిన డబ్బులు ఇవ్వడం లేదు. ఇదేంటని అడుగుతుంటే రౌడీయిజం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తాం.

- యెలిశెట్టి గణేష్, తాడేపల్లిగూడెం


ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కలు పరిశీలిస్తున్న కలెక్టరు

మేలైన వరి వంగడాలను అందించాలి

ఉండి సెప్టెంబరు 10: మేలైన లాభసాటి వరి వంగడాలను రైతులకు అందించడంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నిరంతం కృషి చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం ఉండి మండలం ఎన్‌ఆర్‌పి అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆమె సందర్శించారు. కేంద్రంలో కొన సాగుతున్న పరిశోధనలను గూర్చి ఆరా తీశారు. పరిశోధనలను విస్తృతం చేసి రైతులకు మేలైన వరి, ఫ్లోరికల్చర్, హార్టి కల్చర్ వంగడాలను అందించాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా పంట పొలాలలో, ఉద్యానవన తోటలలో నీరు నిలిచిపోయిందని నీరు తొలగిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. సాగులో డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు.ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లి ఖార్జునరావు, శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, డిబోరా మెషియాన, రీసెర్చ్ అండ్ హెడ్ చంద్ర శేఖరరావు, వినయలక్ష్మీ, విస్తరణాధికారి రజిత, మేనేజరు రామ కృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అటవీ భూమిలో పామాయిల్ తరలింపు..ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం, సెప్టెంబరు 10: అటవీ భూముల్లో పామాయిల్ గెలలు నరికి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు చింతలపూడి అటవీ అధికారి సురేష్ మంగళవారం తెలిపారు. అల్లంచర్ల, కొత్తగూడెం అటవీ భూమిలో అదే గ్రామానికి చెందిన మన్నెంపల్లి సురేష్ 20 ఏళ్ళ క్రితం అడవికి ఆనుకుని ఉన్న తన పొలంలో పామాయిల్ సాగు చేపట్టాడు. తోటపక్కనే ఉన్న అటవీ భూమిని కొంత ఆక్రమించి పామాయిల్ మొక్కలు వేశాడు. మంగళవారం పామాయిల్ తరలిస్తుండడంతో సమాచారం అందుకున్న అటవీ అధికారులు దాడిచేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తణుకులో దారి దోపిడీ..బంగారం, నగదు చోరీ

తణుకు, సెప్టెంబరు 10 :ఒక వ్యక్తిపై దాడి చేసి అతని వద్ద నుంచి బంగారం, నగదు, సెల్‌ఫోన్ అపహరించుకుపోయిన సంఘటన సోమవారం రాత్రి తణుకులో చోటు చేసుకుంది. గణపవరం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన తోట సత్తిపండు, తోట శ్రీను, గంటా కేశవలు సోమవారం రాత్రి రాజమండ్రి నుంచి తణుకు మీదుగా సరిపల్లి వెళుతున్నారు. తణుకు సమీపంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైకుపై వచ్చి కారును అడ్డగించి తమను కారుతో ఢీకొట్టబోయారంటూ వారితో వాదనకు దిగారు. పోలీసు స్టేషన్‌కు వెళదామంటూ బైకుపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్ళి ఇనుప రాడ్‌తో దాడి చేసి మూడు కాసులు బంగారం గొలుసు, 50 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నట్టు బాధితుడు సత్తిపండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

వరద నీటిలో చేపల వేట



కైకలూరు, సెప్టెంబరు 10: కొల్లేరు సరస్సులో వరద ఉధృతి రావడంతో భారీ చేపలు మత్స్యకారులకు దొరుకుతున్నాయి. కైకలూరు మండలం శృంగవరప్పాడు కొల్లేరు ప్రాంతంలో చేపల వేట చేస్తుండగా భారీ చేప చిక్కింది. చేపలచెరువులు నీట మునగడంతో అంత పెద్ద చేపలు సరస్సులోనికి వచ్చాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. పెద్దపెద్ద చేపలు లభించడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఓ పోలీస్ బాస్ కక్కుర్తి..

ప్రజా ప్రతినిధికి ఫిర్యాదు చేసిన వ్యాపారులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 10 : చేసేది పోలీస్ ఉద్యోగం..ఆ స్టేషన్‌కు అతనే బాస్.. అలాంటిది ఇంట్లో వినియోగించే నిత్యావసర సరుకులకు కక్కుర్తి పడి అందరి ముందు చులకన అయ్యాడు. భీమవరం పట్టణంలో ఒక పోలీస్ అధికారి నెల నెలా సుమారు 14 వేల రూపాయలు విలువైన సరుకులు సొమ్ములు ఇవ్వకుండా తీసుకువెళ్ళి పోతుండటంతో ఆ వ్యాపారులు ప్రజా ప్రతినిధికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆ అధికారికి వార్నింగ్ ఇచ్చారు. ఈనెల 8వ తేదీన చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సమావేశంలో ప్రజా ప్రతినిధి ఈ అంశాన్ని ప్రస్తావించడంతో హాట్ టాపిక్‌గా మారింది. తాడేపల్లిగూడెంలో కూడా ఒక పోలీస్ అధికారి తీరుపై కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. సివిల్ సెటిల్‌మెంట్‌లు, అసాంఘిక కార్యక్రమాలకు పట్టించుకోవడం లేదన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన వైసీపీ నాయకునికి పోలీసులు ప్రోటోకాల్ పాటిస్తున్నారని ప్రచారం. వీటిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

కూతురు మాట వినడం లేదని తల్లి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 10 : కుమార్తె మాట వినడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఒక వివాహిత విష గుళికలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రూరల్ మండలం సుంకరవారితోటకు చెందిన తిర్లి కృష్ణకుమారి (38) భర్త సుబ్రహ్మణ్యం, ఒక కుమార్తె ఉన్నారు. భర్త విశాఖ పట్టణంలో పనుల నిమిత్తం వెళ్లాడు. కుమార్తె ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈనెల 9వ తేదీన ఇంట్లో టిఫిన్ పూరీ చేయమని కుమార్తె కోరింది. తల్లి చేయకపోవడంతో కుమార్తె టిఫిన్ చేయడం మానేసింది, తల్లి కూడా తినలేదు. సాయంత్రం వరకూ వీరిద్దరు ఏమీ తినకుండా ఉన్నారు. కుమార్తె మాట వినడం లేదని తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న విష గుళికలను మింగేసింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం అర్థరాత్రి మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్‌ఐ దుర్గా ప్రసాద్ మంగళవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పురుగుమందు తాగి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 10 : మద్యం మత్తులో పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన గొల్లా భరత్‌కుమార్ (45) మద్యం తాగే అలవాటు ఉంది. మద్యం మత్తులో అతను ఈనెల 9వ తేదీన పురుగు మందుతాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దెందులూరు పోలీసులు మంగళవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చోరీకి ప్రయత్నించిన యువకుడికి దేహశుద్ధి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 10: దొంగతనానికి వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణం రామచంద్రాపురంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రాపురంలో దుర్గారావు అనే వ్యక్తి ఇంట్లో ఓ హోటల్ యజమాని తన కుటుంబంతో అద్దెకు ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు గోడ దూకి లోపలికి వెళ్ళారు. ఇది గమనించిన స్థానికులు పట్టుకోవడానికి ప్రయత్నించగా ఒకరు పారిపోయారు. సమ్మంగి మంగరాజు అనే యువకుడు వారికి చిక్కాడు. దీంతో అతడిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన అనంతరం పోలీసులకు అప్పగించారు.

క్రైం కార్నర్..


వివరాలు తెలుసుకుంటున్న నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

4 కిలోల వెండి.. 2.5 కాసుల బంగారు వస్తువులు అపహరణ

పెనుగొండ , సెప్టెంబరు 10 : నగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం రాత్రి చోరి జరిగింది. మంగళవారం ఉదయం ఆలయ అర్చకుడు వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో దేవస్థానం అధికారులకు తెలిపారు. అనంతరం పోలీసులకు తెలియజేయడంతో పెనుగొండ ఎఐ రజనీకుమార్, ఎస్‌ఐ గంగాధరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. 4 కిలోల వెండి వస్తువులు. 2.5 కాసులు బంగారు వస్తువులు చోరీ జరిగినట్టు ఆలయ అధికారులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. భీమవరం నుంచి క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించింది. సాయంత్రం నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ ఆలయ పరిసరాలను పరిశీలించారు. దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామన్నారు. ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు ..చికిత్స పొందుతున్న విద్యార్థిని

అదుపు తప్పిన స్కూల్ బస్సు

ఏడుగురు విద్యార్థులకు గాయాలు

పాలకోడేరు, సెప్టెంబరు 10: పాలకోడేరులో మంగళవారం ఉదయం పెద్ద ప్రమాదమే తప్పింది. మోగల్లు గ్రామం నుంచి భీమవరం చైతన్య కళాశాలకు చెందిన బస్సు పాలకోడేరు వైపు వస్తుండగా లారీని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి దూసుకుపోయింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థినిలకు గాయాలయ్యాయి. ఒకరికి చాతి మీద, మరొకరికి తల పైన తీవ్రగాయం అయ్యింది. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన విద్యార్థినిలను హుటాహుటిన పాలకోడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ఖాళీ స్థలం వైపు కాకుండా పక్కనే ఉన్న పంటబోదెలోకి దూసుకెళ్ళి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థినిలను మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉలిక్కిపడ్డ గ్రామస్థులు

బస్సు ప్రమాదంతో పాలకోడేరు గ్రామంతో పాటు పక్కగ్రామాల ప్రజలను కూడా ఉలిక్కిపడ్డారు.కళాశాలకు బయలుదేరిన బస్సుకు ప్రమాదం జరిగిందని తెలియడంతో ప్రయాణం చేస్తున్న 25 మంది విద్యార్థినుల తల్లిదండ్రులు పాలకోడేరు పీహెచ్‌సీకి చేరుకుని విద్యార్థినిలను చూసిన తరువాత ఊపిరి పీల్చుకున్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని విద్యార్థినులకు చికిత్స అందించారు.

సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం



ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 10: అన్ని వర్గాల ప్రజలకు ఆమోగ్యమైన నిర్ణయాలతో సుపరిపాలన దిశగా రాష్ట్రాన్ని ప్రగతి పథాన కూటమి ప్రభుత్వం పయనిస్తుందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అప్పటికప్పుడు ఆయా సమస్యల పరిష్కారాల కోసం సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు.

మెరుగైన పాలన కూటమితోనే సాధ్యం

పెదపాడు, సెప్టెంబరు 10 : మెరుగైన పాలన కూటమి నాయకులతోనే సాధ్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అప్పనవీడులో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన పార్టీల స్థూపాల వద్ద ఇరుపార్టీల జెండాలను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని మంగళవారం ఎగురవేశారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి, పరిష్కరించడంలో కూటమి శ్రేణులు భాగస్వాములు కావాలని చింతమనేని పిలుపునిచ్చారు.

వరద బాధితుల సహాయానికి తరలిన నేతలు



సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌తో పార్థసారథి బాబు తదితరులు

కామవరపుకోట, సెప్టెంబరు 10 : విజయవాడ 44వ డివిజన్‌లో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు సహాయ సహకారాలు అందించేందుకు ఆ డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబు, మిత్ర బృందం దాదాపు 150 మంది యువకులు మంగళవారం తరలివెళ్ళారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ శ్రేణులు ఆర్.పరాత్పరరావు, పి.రవి, సీహెచ్.భాస్కరరావు, పి.విజయభాస్కర్, తదితరులు ఉన్నారు.

ఎన్‌టీఏ నగర శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.వెంకటేశ్వరరావు, జి.సాయి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.రామమూర్తి, కోశాధికారిగా జి.నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా బీవీ రమణకుమారి ఎన్నికయ్యారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరమణారావు, ప్రధానకార్యదర్శి టి.మురళి, నాయకులు రూజ్‌వెల్ట్, రాము, బాలాజీ, సాదర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 10 : సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎం.ముక్కంటి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం ముక్కంటి సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రజల ఇళ్ళకు వెళ్లి జ్వరాలు,ఇతర అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు చెప్పాలని తెలిపారు. శిథిలావస్థకు చేరిన భవనాలలో అంగన్‌వాడీ పాఠశాలలు నిర్వహించ వద్దన్నారు. వినాయక నిమజ్జనాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. తహసీల్దారు కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పోలవరం, సెప్టెంబరు 10 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. వర్షాలకు ముంపునకు గురైన రైతుల పంటల ఎమ్యూనరేషన్ తదితర అంశాలపై ఎంపీపీ వ్యవసాయాధికారి కె.రాంబాబుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో జి.శ్రీను, తహసీల్దారు జీవీ ప్రసాద్, అధికారులు, మండల సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పాడైన వరి పంటను చూస్తున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 10: భారీ వర్షాలకు కొల్లేరు వరద వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు రూరల్ మండలంలోని జాలిపూడిలో కొల్లేరు వరద ముంపునకు గురైన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించి పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు టి.రంగారావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సత్య సాయి సేవా సంస్థల సేవలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 10 : వరద బాధితులకు వేల సంఖ్యలో వాటర్ బాటిల్స్, ఆహార పదార్థాలను జిల్లా సత్యసాయి సేవా సంస్థలు వ్యాన్లు ద్వారా మంగళవారం తరలించారు. ఈ కార్యక్రమాన్ని రామకృష్ణాపురంలోని సత్యసాయి సేవా సంస్థల భవనం వద్ద నగరపాలక సంస్థ కో ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కె.శశిశేఖరరావు, ఏలూరు సమితి కన్వీనర్ పి.రామారావు, శాంతకుమార్ ఉన్నారు.

సామూహిక సీమంతాలు



భీమడోలు, సెప్టెంబర్ 10 : స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా భీమడోలు ఎంపీడీవో కార్యాలయం లో సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ రామతులసమ్మ, టీడీపీ నేతలు ఇ.రామకృష్ణరాజు, బీజేపీ నాయకులు ప్రవీణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రత, పరిరక్షణపై అవగాహన

కామవరపుకోట, సెప్టెంబరు 10 : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలికల భద్రత పరిరక్షణ, ఆరోగ్యం సంరక్షణపై అవగాహన సదస్సును ప్రముఖ కోకో లైఫ్, ఆప్తో కంపెనీ ఏలూరు ప్రతినిధులు రాజేష్, అశోక్‌ల ఆధ్వర్యంలో జరిపారు. మహిళా పోలీసు అధికారి పుష్పావతి, హెచ్ఎం భీమరాజు, ఉపాధ్యాయులు రాములు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్కౌట్స్ ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావులు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. హెల్ప్‌లైన్ 1098, 100, 181112 నెంబర్లకు ఫోన్‌చేయ వచ్చని అవగాహన కల్పించారు.

వృథా నీరు రోడ్డుపైకి..

కుక్కునూరు, సెప్టెంబర్ 9: మండలంలో జామాయిల్ వ్యాపారుల నిర్లక్ష్యానికి పలు చోట్ల రహదారులు ఛిద్రమవుతున్నాయి. జామాయిల్ మొక్కల పెంపకంలో భాగంగా నర్సరీల్లో మొక్కలకు నీటిని స్ప్రే చేస్తుంటారు. స్ప్రే చేయగా కిందపడిన నీటిని రహదారి పైకి వదిలివేస్తున్నారు. దీంతో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నీటితో నిండి దెబ్బతింటోంది. పెద్దపెద్ద గోతులు పడుతున్నాయి. వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బంజరుగూడెం, అల్లిగూడెం, వేలేరు వద్ద రహదారి ఎక్కువగా దెబ్బతింది. దీనిపై పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. క్రాస్ రోడ్డు, అల్లిగూడెం, భువనగిరి, పెదరావిగూడెం, వేలేరు ప్రాంతాల్లో జామాయిల్ నర్సరీలు ఉన్నాయి.

పేకాట స్థావరం పై పోలీసుల దాడి

కొయ్యలగూడెం, సెప్టెంబరు 10: పేకాట స్థావరం పై పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను రూ.61500లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని కన్నాపురం గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఉన్నతాధికరుల ఆదేశాల మేరకు దాడి చేశామన్నారు. ఇటువంటి సంఘటనలకు ప్రజలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు. పేకాట, జూదం వంటి క్రీడల్లో పాల్గొనే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



జంగారెడ్డిగూడెంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు, సీఎంకు చెక్కును అందజేస్తున్న లింగపాలెం టీడీపీ నేతలు, ఉంగుటూరులో ఎమ్మెల్యే ధర్మరాజుకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న రామారావు, ఏలూరులో వరద బాధితుల విరాళాల సేకరణకు నిర్వహిస్తున్న ర్యాలీ, వరద బాధితులకు విరాళం అందజేస్తున్న ద్వారకాతిరుమల మండలంల దొరసానిపాడు నేతలు

అండగా ఉందాం

» వరద బాధితులకు విరాళాల వెల్లువ

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 10 : సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో ర్యాలీగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యురాలు కె.బేబి, ఏలూరు సమితి కార్యదర్శి యు.హేమశంకర్, సహాయ కార్యదర్శి కె.వరప్రసాద్, ఎం.విజయ, ఎ.లక్ష్మీ, ఇందిర, కె.సుధారాణి, స్వాతి, మూర్తి, లక్ష్మీ, భవాని, అభిలాష్‌కుమార్, కాటూరి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ మేరకు ర్యాలీ పవరుపేట రైల్వేస్టేషన్ నుంచి రామచంద్రరావుపేట మెయిన్ రోడ్డులో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- చింతలపూడి : విజయవాడ వరద బాధితులకు మండల సీపీఐ కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేయగా, రూ.25,800లు వచ్చాయని, ఈ మొత్తాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్యకు మంగళవారం కార్యాలయంలో అందచేసినట్లు మండల సీపీఐ కార్యదర్శి కంచర్ల గురవయ్య తెలిపారు.
- జంగారెడ్డిగూడెం : వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలంతా విరివిగా విరాళాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి. మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ ప్రారం భించారు. పార్టీ మండల కార్యదర్శి జేవీ రమణరాజు, సహాయ కార్యదర్శి కె.వసంతరావు, మండల కమిటీ సభ్యులు బాలయేసు, ఘటోత్కచుడు, రామారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- ద్వారకాతిరుమల : గ్రామానికి చెందిన యువనేత మల్లిపెద్ది రాజేంద్ర బాబు ప్రసాద్ రూ.50 వేలు, మారంపల్లి నుంచి రూ.2.20 లక్షలు, దొరసానిపాడు నేతలు రూ.1.02 లక్షలు, లైన్‌గోపాలపురం లారీ అసోసియేషన్ వారు రూ.50 వేలు, పంగిడిగూడెం నుంచి రూ.1.03 లక్షలు, వెంకట కృష్ణాపురం రూ.70 వేలు మొత్తం రూ.5.93 లక్షలను సీఎం సహాయనిధికి అందించాలని కోరుతూ పోలిన శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ తదితరులకు అందించారు.
- లింగపాలెం : ధర్మాజీగూడెంకి చెందిన టీడీపీ నాయకులు గారపాటి బుజ్జియ్య రూ.50 వేలు, ఏలూరు పార్లమెంటరీ టీఎస్ఎస్ఎఫ్ వైస్ ప్రసిడెంట్ గారపాటి సాయి రూ.20 వేలు, శ్రీసాయి కాలేజ్ కరస్పాండెంట్ గంధం సాంబశివరావు రూ.10 వేలు చెక్కు రూపంలో సీఎం చంద్రబాబుకి అంద చేశారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌తో పాటు తాము కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నామని వారు తెలిపారు.
- ఉంగుటూరు : గ్రామానికి చెందిన గ్రీన్ ఆసియా ఇంపెక్స్ ప్రైవేటు కంపెనీ అధినేత పి.వెంకట రామారావు రూ. మూడు లక్షల చెక్కును, కాగుపాడు నాయకుడు కడియాల రవిశంకర్ నేతృత్వంలో గ్రామస్థులు రూ.3.02 లక్షలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, మండల టీడీపీ అధ్యక్షుడు పాతూరి విజయ కుమార్ రూ.లక్ష చెక్కును, నాచుగుంట (కొత్తగూడెం) ఎంపీపీ పాఠశాల విద్యార్థులు రూ.12,275లు, రావులపర్రుకు చెందిన తాడిశెట్టి శివప్రసాద్ రూ.10 వేలు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు అందజేశారు. మొత్తంగా మంగళవారం ఒక్కరోజే రూ.13,77,705లు అందింది.
- టి.నరసాపురం : గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి రేఖాంబిక రూ.ఏడు వేల విరాళాలు సేకరించి పాఠశాల యాజమాన్యానికి అందచేశారు.

రేషన్ పంపిణీని వేగవంతం చేయండి



రేషన్ పంపిణీపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ

పెదపాడు, సెప్టెంబరు 10 : వరద ప్రభావిత గ్రామాల్లో రేషన్ పంపిణీకి తొలి ప్రాధాన్యతనివ్వాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి అధికారులను ఆదేశించారు. సత్యవోలులో రేషన్ పంపిణీ విధానాన్ని జేసీ ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. జిల్లాలో భారీ వర్షాలు, వరద బాధితులకు సంబంధించి 3,278 కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ కానుందని తెలిపారు. జిల్లాలో ఆరు లక్షల రేషన్‌కార్డుదారులకు రెగ్యులర్‌గా అందించే రేషన్ కూడా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లుగా జేసీ తెలిపారు. డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రభావిత ప్రాంతాల్లో..

ఏలూరు రూరల్, సెప్టెంబరు 10: కొల్లేరు వరద ప్రభావిత గ్రామాల్లో నూరు శాతం రేషన్ పంపిణీ చేయాలని, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఏలూరు ఆర్డీవో ఖాజావలీ తెలిపారు. మంగళవారం కోటేశ్వరదుర్గాపురం, గురుకులపేట, తిమ్మారావుగూడెం, కలకుర్రుగ్రామాల్లో రేషన్ పంపిణీతీరును ఆయన పరిశీలించారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నెం.85తో మూడేళ్ల సర్వీసు కోల్పోతున్నాం

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

కుక్కునూరు, సెప్టెంబరు 10: జీఓ నెం.85 ద్వారా తమ మూడేళ్ళ సర్వీసు కోల్పోతున్నామని తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వైద్యులు పేర్కొన్నారు. జీఓ నెంబర్ 85ను వ్యతిరేకిస్తూ కుక్కునూరు డివిజన్ డాక్టర్లు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుక్కునూరు, అమరవరం వైద్యులు పూర్ణశ్రీనివాస్, అనంత్, శ్రీకాంత్‌లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

- పోలవరం, సెప్టెంబరు 10 : వైద్యులు ఆందోళనకు తమ సంఘీభావం తెలుపుతున్నట్లు వింజరం వైద్యాధికారి మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తామన్నారు రెండు నెలల నుంచి జీవో నెం.85 రద్దు చేయాలని కోరుతున్నామని ప్రభుత్వం స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.
- లింగపాలెం : ధర్మాజిగూడెం, కె.గోకవరం, లింగపాలెం పీహెచ్‌సీ వైద్యులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. జీవో నెంబర్ 85కి వ్యతిరేఖంగా తాము ఆందోళనను వ్యక్తం చేస్తూ విధులకు నల్లబ్యాడ్జీలతో హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే సాయం



బాధిత బాలుని తండ్రికి ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, సెప్టెంబరు 10 : కాలేయానికి సంబంధించిన వ్యాధితో బాధపడు తున్న చిన్నారికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అండగా నిలిచారు. వైద్యానికయ్యే వ్యయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించేలా చర్యలు తీసుకున్నారు. కూలి పను లతో కుటుంబాన్ని పోషించుకుంటున్న దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయతీ చల్లపల్లి గ్రామానికి చెందిన ఎం.సుదర్శనరావు ఎనిమిదేళ్ల చిన్న కుమారుడు గత జూలైలో అనారోగ్యానికి గురికావడంతో ఏలూరు, అక్కడనుంచి విజయవాడలో పరీక్షలు చేయించారు. అతనికి కాలేయానికి సం బంధించిన వ్యాధి సోకిందని, వైద్యానికి రూ.22 లక్షలకుపైగా ఖర్చవు తుందని వైద్యులు చెప్పారు. రోజురోజుకు నీరసించి పోతున్న ఆ బాలుడిని అందినకాడికి అప్పులు చేసి హైదరాబాద్ తీసుకెళ్ళి వైద్యం చేయిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్.. బాధి త బాలుని కుటుంబ సభ్యులను నేనున్నానంటూ ఓదార్చి, వైద్యానికి అయ్యే వ్యయాన్ని సీఎం సహాయనిధి ద్వారా అందించే ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చి రూ.12 లక్షలు అందించేలా ఎల్‌వోసీ ఇప్పించారు. ఈ పత్రాన్ని మంగ ళవారం దుగ్గిరాల కార్యాలయంలో బాలుని తండ్రి సుదర్శనరావుకు, ఎమ్మెల్యే అందించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. దెందులూరు ఏఎంసీ మాజీచైర్మన్ మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, పార్టీ నాయకులు మాగంటి నారాయణప్రసాద్, కమ్మ శివరామకృష్ణ, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వారిని టీడీపీలోకి తీసుకోవద్దు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 10: టీడీపీ కార్యకర్తలను వేధించిన వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానించటం తగదని, తెలుగుదేశం పార్టీ కొల్లేరు ప్రాంత నాయకుడు శ్రీపర్రు గ్రామ టీడీపీ అధ్యక్షుడు సైదు గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దెందులూరు నియోజకవర్గంలో పార్టీని కార్యకర్తలు, నాయకులకు తెలియకుండా ఇబ్బందులు పడిన వారి అభిప్రాయాన్ని తీసుకోకుండా వారి త్యాగాలకు విలువ లేకుండా వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానించటం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల వైసీపీ నాయకులు టీడీపీలో చేరడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల నుంచి తప్పించుకునేందుకే వారు టీడీపీలో చేరుతున్నారని గోవర్ధన్ అన్నారు.

కాజ్‌వేపై రాకపోకల పునరుద్ధరణ



ఏలూరు క్రైం, సెప్టెంబర్ 10 : తమ్మిలేరు కాలువ ప్రవాహంతో ఏలూరు-శనివా రపుపేట కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిపి వేశారు. రెండు రోజుల నుంచి రాకపోకలు నిలిపివేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్య ఏలూ రు ఆర్డీవో ఎస్ఎస్‌కె ఖాజావలి, ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారపుపేట కాజ్‌వేను మంగళవారం డీఎస్పీ శ్రావణ్‌కుమార్, టూ టౌన్, త్రీ టౌన్ సీఐలు వైవీ రమణ, కోటేశ్వరరావు పరిశీలించారు. వెంటనే రెండు జేసీబీలతో నీటి ప్రవాహం త్వరత్వరగా కాజ్‌వే కింద నుంచి వెళ్లేలా తూడును, చెత్తను తొలగించారు. అంతేకాకుండా ఎక్కడైతే కాజ్‌వే పైకి నీరు వస్తుందో ఆ భాగం వద్ద మట్టిని అడ్డుకట్టగా వేయించారు. దీంతో రెండు గంటల సమయంలోనే నీరు కాజ్‌వే కింద నుంచి వెళ్లడం ప్రారంభమైంది. ఆ తరువాత శనివారపుపేటకు చెందిన పారిశుధ్య కార్మికులు అక్కడకు చేరుకుని కాజ్‌వేను శుభ్రం చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి వాహనాల రాకపోకలకు, పాదచారులకు పోలీసులు అనుమతి ఇచ్చారు. అయినప్పటికీ కాజ్‌వే పరిస్థితిని, చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం లో ఉన్న తమ్మిలేరు జలాశయంతో ఎంత నీరు వస్తుందో ఎప్పటికప్పుడు ఆర్డీవో, ఏలూరు డీఎస్పీలు తెలుసుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

పొలాల్లో తగ్గని నీరు



ఏలూరు రూరల్, సెప్టెంబరు 10: ఏలూరు రూరల్ మండలంలోని పాలగూడెం, జాలిపూడి, కట్లంపూడి, కోటేశ్వర దుర్గాపురం, చాటపర్రు, కోణంగి గ్రామాల్లో పది రోజుల క్రితం కురిసిన వర్షం నీరు వరి పంట పొలాల్లోనే ఉంది. డ్రైనేజిల పై అధికారులు దృష్టి సారించకపోవడంతో సుమారు 600 ఎకరాలు పైనే నీటిలో నానుతున్నాయి. వరినాట్లు వేసిన పంట పొలం అంతా నాలుగు అడుగుల లోతు నీళ్ళలో ఉండటంతో పంట అంతా వర్షార్పణం అయిందంటూ రైతులు బోరున విలపిస్తున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెట్టి నాట్లు వేశామని, పది రోజులు నీటిలోఉండిపోయి నారుఅంతా చీకిపోయి పంట పనికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు బయటకు వెళ్ళే మార్గం లేకపోవడంతో పైర్లు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు అందచేస్తున్నారు.

పంట నష్టం అంచనా వేశాం : ఏవో

జీలుగుమిల్లి, సెప్టెంబరు 10 : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు మండల వ్యవసాయాధికారి కాళింగ గంగాధరం చెప్పారు. కామయ్యపాలెంలో వర్షాలకు కొద్ది రోజుల క్రితం నాటిన వేరుశనగ పంట మొలక దెబ్బతిందన్నారు. 120 ఎకరాల్లో వేరుశనగ మొలక దశలో కుళ్లి పోయిందని, వరి 25 ఎకరాలు, పత్తి ఐదేకారాలకు నష్టం వాటిల్లిందన్నారు. వరి పంటలకు పోటాష్ బాస్వరం ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. అనంతరం రైతు సంఘం నాయకులకు వివరాలు వెల్లడించారు. సీహెచ్ సీతారామయ్య, వై.నరసింహం, సీహెచ్ శేషగిరిరావు, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కొయ్యలగూడెం, సెప్టెంబరు 10: వరదలు, వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులుపడుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి బుజ్జిబాబు కోరారు. ఈ మేరకు మంగలవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం హాలులో మండలంలోని అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గత కొన్నిరోజులుగా భారీ వర్షాలు కురిసాయని దీని వలన ప్రజలు అనేక ఇబ్బందులుపడ్డారని అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అధికారులను గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పంచాయతీ, రెవిన్యూ, పోలీస్, అధికారులు పాల్గొన్నారు.

భూ స్వాములపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 10 : ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ప్రభుత్వానికి భూములను అమ్ముకుని అదే భూముల్లో అక్రమంగా బ్యారన్‌లను అనుభ విస్తున్న గిరిజనేతర భూ స్వాములపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం అధికారి శ్రీహరికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, బుట్టాయగూడెం మండల కార్యదర్శి టి.రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో దొరమామిడి కోయిదా పునరావాస కాలనీల సమీపంలో ఇరవై బ్యారన్‌లను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో అమ్మివేశారని గుర్తుచేశారు. వెంటనే అటువంటి వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఆ బ్యారన్‌లను నిర్వాసితులకు అప్పగించాలని లేదా లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎం.నాగమణి,పి.నాగేశ్వరరావు, భాస్కర్, రాంబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి నిరసన



ఏలూరు పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న రాష్ట్ర అఖిలపక్ష ట్రేడ్ యూనియన్స్, రైతు సంఘాల నేతలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 10 : స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకట్రావు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం స్టీల్ ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతబ స్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. రైతు సంఘాల నాయకులు డి.ప్రభాకర్, కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు బి.వెంకటేశ్వరరావు, కిసాన్ సెల్ నాయకులు ఆర్.రామ్మోహన్‌రావు, ఏఐటీ యూసీ, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్స్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- కామవరపుకోట : విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ యాజమాన్యంలోనే నిర్వహించాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులోని కొత్తూరులో రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నారన్నారు. అటువంటి సంస్థను ప్రధాని మోదీ అంబానీ, ఆదానీలాంటి ప్రైవేటు శక్తులకుకట్టబెట్టాలని చూస్తున్నారని, అది తగదని పేర్కొన్నారు. ఆ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. నాయకులు పాల్గొన్నారు.

సందడిగా గణపతి నిమజ్జనాలు



కామవరపుకోటలో నిమజ్జన ఊరేగింపులో చిన్నారుల సందడి



ద్వారకాతిరుమల ఊరేగింపులో చిత్రవిచిత్ర వేషధారణలు

పట్టెన్నపాలెం రహదారి ఛిద్రం.. నిలిచిన రాకపోకలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 10 : వరద ఉధృతికి మండలంలోని పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద తాత్కాలిక డైవర్షన్ రహదారి తీవ్రంగా దెబ్బతింది. రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుంగుతున్న కల్వర్టు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 10 : నెల రోజులుగా అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు లంకపాకల-రేపల్లె గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలోని కొండవాగుపై నిర్మించిన కల్వర్టు కోతకుగురై కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ కల్వర్టు కూలిపోతే అటవీ ప్రాంతంలోని రేపల్లె, రేగులపాడు, గొట్టాలరేవు, డోలుగండి, మోదేలు కొండరెడ్డి గ్రామాలకు బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయినట్లే. ఐదు గ్రామాలకు చెందిన కొండరెడ్లు నిత్యవసరాలు, ఆస్పత్రులకు, ప్రభుత్వ కార్యాలయాలకు రావాలంటే ఇదొక్కటే మార్గం. కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టు కూడా కొండరెడ్లు ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తేగాని అధికారులు నిర్మించలేదు. ఆదేమిటని అడిగితే అటవీ ప్రాంతాల్లో అనుమతులు లేవంటూ విద్యుత్, రోడ్లు, కల్వర్టులు నిర్మించలేదు. పోరాటాలు ఫలితంగా అలివేరుకు సుమారు కిలో మీటరు దూరంలో ఐటీడీఏ అధికారులు కొండవాగుపై కల్వర్టును నిర్మించారు. గత నెల రోజులుగా ఏజెన్సీలో కురుస్తున్న భారీవర్షాలకు కల్వర్టు కోతకుగురై మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడింది. ఎప్పుడు కూలిపోతుందో, ఎప్పుడు కొట్టుకుపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఆయా గ్రామాలకు చెందిన కొండరెడ్లు ఆందోళన చెందుతున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **బుట్టాయగూడెం :** రెడ్డిగణపవరంలో వినాయక చవితి సందర్భంగా గీతా మందిరం వద్ద ఏర్పాటు చేసిన గణేషుని మండపం వద్ద మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు.
- **పెదపాడు :** అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి వారి దేవాలయం వద్ద ఓలేటి వెంకటేశ్వరరావు సహకారంతో మంగళవారం అన్న సమరాధన నిర్వహించారు.
- **చింతలపూడి :** నగర పంచాయతీలోని సుప్రీమ్‌పేట అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులకు, బాలింతలకు, మహిళలకు పౌష్టికాహార ఉత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శన జరిపి వాటి పోషక విలువలు, తయారీపై ఐసీడీఎస్ పీవో మాధవి అవగాహన కల్పించారు.
- **ఏలూరు అర్బన్ :** ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ, ఐటీఐలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 77 మంది వివిధ కంపెనీల్లో ఉపాధి పొందారని సంస్థ జిల్లా అధికారి జి.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.
- **భీమడోలు :** భీమడోలులో నిర్వహించిన జాబ్ మేళాలో 67 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి కల్పించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఘంటా సుధాకర్ తెలిపారు.
- నూతనంగా విధుల్లోకి చేరిన భీమడోలు సీఐ యుజె విల్సన్ ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- **టి.నరసాపురం :** రాజుపోతేపల్లిలో నిర్వహించిన గణపతి లడ్డూను రూ.91,116 లకు గ్రామానికి చెందిన డి.సూర్యనారాయణ దంపతులు వేలంలో దక్కించుకున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.
- **జీలుగుమిల్లి :** పంచాయతీలో పారిశుధ్యం డ్రైనేజీ ద్వారా మురుగు నీటి పారుదల వంటి అంశాలపై జిల్లా పంచాయితీ అధికారి టి.విశ్వనాథ్ ఆరా తీశారు. జీలుగుమిల్లి మంగళవారం సాయంత్రం ఎంపీపీ పాఠశాల సమీప డ్రైనేజీలో మురుగునీటి నిల్వలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ సంఘాన్ని విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడిన నిమ్మగడ్డ నరసింహన్‌ను ఏపీ రైతు సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కమిటీ ప్రకటించింది. అన్నే భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు.
- **ఏలూరు టూ టౌన్ :** యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ యువతి, యువకులకు ఫోటోగ్రాఫి, విడియోగ్రఫిలో నెలరోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ తెలిపారు. 10వ తరగతి ఆ పైన చదివి 19 - 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.
- ఏలూరు హేలాపురి రూరల్ లయన్స్‌క్లబ్, ఏలూరు దుర్గాతేజ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం దగ్గర ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ నెల 14న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు క్లబ్ అధ్యక్షులు ఎంవీఎస్ నాగేశ్వరరావు, గీతాపంకజ్ తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** సుబ్బంపేట లోని 82 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో పి.బ్యూలా ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.
- **ఏలూరు క్రైం :** ఏలూరు ఐసీడీఎస్ 3వ నెంబర్ ప్రాజెక్టు పరిధిలోని గజ్జలవారిచెరువు అర్బన్ హెల్త్ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పిల్లలకు ఎనీమియా రాకుండా ఉండాలంటే పౌష్టికాహారం అందించాలని ఏలూరు సీడీపీవో పద్మావతి అన్నారు.



భారీ చేప చిక్కిందోచ్!

కైకలూరు, సెప్టెంబర్ 10: కొల్లేరు సరస్సులో వరద ఉధృతి రావడంతో భారీ చేపలు మత్స్యకారులకు దొరుకుతున్నాయి. కైకలూరు మండలం శృంగవరప్పాడు కొల్లేరు ప్రాంతంలో మత్స్యకారులకు భారీ చేప చిక్కింది. చేపల చెరువులు నీట మునగడంతో అంత పెద్ద చేపలు సరస్సులోనికి వచ్చాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. పెద్దపెద్ద చేపలు లభించడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఎన్ఎస్‌పీ కెనాల్ గండిని పూడ్చాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 10: నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని వేంపాడు మేజరుకు ఏర్పడిన గండిని తక్షణం పూడ్చాలని సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నూజివీడు మండలం తూర్పు దిగవల్లి - ముక్కొల్లుపాడు కాలువల మధ్య ఎన్ఎస్‌పీ కాలువను రైతు సంఘం ప్రతినిధులు పరిశీలించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ కాలువకు గండి పడి సుమారు 30 ఎకరాల్లో వరి, మినుము పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతుల్ని ఆదుకోవడంతో పాటు కెనాల్ గండిని పూడ్చాలన్నారు. కూచిపూడి నాగేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

గండ్లను పరిశీలించిన అధికారులు

ముదినేపల్లి, సెప్టెంబరు 10 : వర్షాలకు ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామంలో గట్లు బలహీనమై గండ్లు పడిన చేపల చెరువులను మంగళవారం రెవెన్యూ, ఫిషరీస్ అధికారులు పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన బాసినశెట్టి కిషోర్ చేపల చెరువులకు సోమవారం గండ్లు పడి చేపలు బయటికి కొట్టుకుపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిన సంఘటనపై వీఆర్ఓ సుబ్రహ్మణ్యం, మండల మత్స్యశాఖాభివృద్ధి అధికారి సతీష్ చెరువులను పరిశీలించారు. జిల్లా ఫిషరీష్ అధికారులకు నివేదిక పంపారు.



ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

నూజివీడు, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని, కార్మిక, రైతు సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో ఏఐటీయూసీ, సీఐటీయూ రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూనియన్ల నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌కు గనులు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థగానే ఉంచాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజులుగా రిలే దీక్షలు చేస్తుంటే కేంద్రం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ కార్యదర్శి జి.రాజు, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, గిరీష్, ఆనంద్, ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో నిమజ్జనాలు వద్దు

కలిదిండి, సెప్టెంబరు 10 : గణేష్ నిమజ్జనాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉప్పుటేరు పొంగుతున్న దృష్ట్యా గణేష్ నిమజ్జనాలను ఉప్పుటేరులో చేయరాదన్నారు. నిమజ్జనాలు రెవెన్యూ, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలన్నారు. నవ రాత్రుల 7, 9వ రోజుల్లో గణేష్ నిమజ్జనాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



ఇసుక తరలిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆగని ఇసుక దోపిడీ?

ఆగిరిపల్లి, సెప్టెంబరు 10: ప్రభుత్వం మారినా వైసీపీ ఆధిపత్యం మారలేదనేందుకు ఉదాహరణ ఇది. ఆగిరిపల్లి మండలంలో జగనన్న కాలనీల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో ఆగిరిపల్లి జడ్పీ హైస్కూలులో ఇసుకను డంప్ చేశారు. ఇప్పుడు ఆ ఇసుకను కొందరు వైసీపీ సానుభూతిపరులు బహిరంగంగా ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నా గృహ నిర్మాణ శాఖ మాత్రం ప్రశ్నించలేని పరిస్థితిలో ఉందనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ సానుభూతి పరులు బహిరంగంగా ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తరలిస్తున్న విషయాన్ని హౌసింగ్ ఏఈ అలీముల్లా దృష్టికి తీసుకెళ్లగా తాను ఫ్లడ్ డ్యూటీలో ఉన్నానని, డంప్ ఉంచిన ప్రాంగణానికి సంబంధించిన తాళాలు తనవద్దే ఉన్నాయని వివరణ ఇచ్చారు. అయితే ఫోన్ చేసిన పావు గంటకే ఇసుక తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు, ఇసుక డంప్ ప్రాంగణం నుంచి బయటకు వెళ్ళటం విశేషం.

స్కీమ్ పేరుతో ముంచేశారు

వారానికి రూ.40 కడితే ఆకర్షణీయమైన బహుమతులు

తాడేపల్లిగూడెంలో బయటపడిన మోసం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: తాడేపల్లిగూడెంలో స్కీమ్ పేరుతో నయామోసం తెరమీదకు వచ్చింది. వారానికి రూ.40 కడితే ప్రత్యేక బహుమతులు అంటూ ఆకర్షించారు. వారం వారం రూ.40 పెంచుకుంటూ 32 వారాల పాటు చెల్లించాలి. ఈ స్కీమ్‌లో మొదటి నెలలో తక్కువ ఖరీదు ఉన్న వస్తువులను ఎరవేసి వందల సంఖ్యలో స్థానికులను చేర్చుకుని చివరికి వస్తువులు ఇవ్వాల్సిన సమయంలో చేతులెత్తేశారు. దీంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తాము మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. స్కీమ్ వ్యవహారం మంగళవారం ఆ నోటా ఈనోటా బయట పడి చివరికి నిర్వాహకులను నిలదీస్తే వస్తువులు వస్తాయంటూ మరో కథ చెప్పడం ప్రారంభించారు. దీంతో స్కీం కట్టిన వారు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

లక్షల్లో మోసం..

ఈ స్కీమ్‌లో మొదటివారం రూ.40 చెల్లించాలి. తరువాత వారం మరో 40 పెంచి రూ.80 కట్టాలి. ఇలా మొత్తం 32 వారాల పాటు పెంచుకుంటూ వెళితే లక్షల్లో సొమ్ము జమవుతుంది. ఈ స్కీమ్‌లో 500 మంది సభ్యులు ఉంటే చివరికి మిగిలిన 150 మంది సభ్యులకు ఇన్వర్టర్ అందించాల్సి ఉంది. ఈ స్కీంలో చిన్న చిన్న వస్తువులు గెలుచుకున్న సభ్యులకు వస్తువులు ఇచ్చిన నిర్వాహకులు పెద్ద వస్తువులు గెలుచుకున్న వారికి మొండిచేయి చూపించారు. దీంతో సొమ్ములు కట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. ఈ తరహా స్కీమ్‌లలో ఒక్కో స్కీమ్ 500 మంది చొప్పున సభ్యులను చేర్చుకుని లాటరీ తీస్తుంటారు. పదుల సంఖ్యలో ఇలాంటి స్కీమ్‌లు నిర్వహించి ప్రజలను మోసం చేస్తున్నారు. ఒక్కో స్కీమ్ ద్వారా లక్షల్లో లాక్కుని వేలలో వస్తువులు అప్పగించి ప్రజలను మోసగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ముంపులో పెయ్యేరు - దాకరం రహదారి

పెయ్యేరు - దాకరం రహదారి మునక..

రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్

- డ్రెయిన్లు బాగు చేస్తేనే వ్యవసాయం
- ఎమ్మెల్యే కామినేనితో రైతులు

ముదినేపల్లి, సెప్టెంబరు 10 : భారీ వర్షాల వల్ల పొలాల్లో ఏర్పడిన ముంపు నీరు మురుగు కాల్వల్లోకి చేరకపోవడంతో రహదారులను ముంచెత్తుతూ గ్రామాల్లోకి ప్రవేశిస్తోంది. పోల్ రాజ్ మేజర్‌లో నీటి ప్రవాహం స్తంభించటంతో పేరూరు, దాకరం, పెయ్యేరు గ్రామాల్లో వందలాది ఎకరాల ఆయకట్టులోని పొలాల్లో ముంపు కొంచెం కూడా తగ్గటం లేదు. దీంతో పెయ్యేరు, దాకరం గ్రామాల పొలాల్లో గట్లు కూడా కనిపించని విధంగా నెలకొన్న ముంపు మంగళవారం ఇంకా పెరిగి పై రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారి కూడా మునిగిపోయింది. దాకరం వైపు నుంచి పెయ్యేరు గ్రామానికి చెందిన భూముల్లోకి రహదారిని దాటుకుంటూ ముంపు నీరు ప్రవేశించింది. దీంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. పొలాల నుంచి ముంపు నీరు పెయ్యేరు దళితవాడలోని కొన్ని గృహాల్లోకి కూడా ప్రవేశించింది. పొలాల్లో ముంపు పెరుగుతుండటంతో దళితవాడ వాసులు ఆందోళన చెందుతున్నారు.

సాగు చేయలేం : ఎమ్మెల్యే కామినేనితో రైతులు

డ్రెయినేజీ, ఇరిగేషన్ వ్యవస్థలను మెరుగుపర్చకపోతే వరి సాగు కష్టమని ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు మొరపెట్టుకున్నారు. భారీ వర్షాలకు మండలంలోని ప్రొద్దువాక, దేవపూడి, వణుదుర్రు, ఊటుకూరు, వాడవల్లి గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను ఆయన రైతులు, కూటమి నాయకులతో కలసి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు కామినేనికి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కుళ్లిన వరి పైరును చూపించారు. ఊటుకూరు మీడియం డ్రైన్‌లో ఏళ్ల తరబడి పెరిగిన కిక్కిస వల్ల వందలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయని, నేటికీ కిక్కిస తొలగించలేదని రైతులు ఎమ్మెల్యేకి తెలిపారు. ప్రతి ఏటా జూన్ నాటికి డ్రెయిన్లు బాగు చేయకపోతే వ్యవసాయ కష్టమని, పెదలంక మేజర్, తుమ్మిడి - చెన్నూరు మేజర్ డ్రెయిన్ల కింద ముంపు భారీగా ఏర్పడిందని దేవపూడి, వాడవల్లి రైతులు కామినేనికి తెలిపారు. గతేడాది పంట నష్టపోయిన రైతులు చాలా మందికి ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని వాడవల్లిలో రైతులు ఫిర్యాదు చేశారు. వర్షాలకు వరి పంటకు అపారమైన నష్టం సంభవించిందని, రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డ్రైన్ల అభివృద్ధికి ప్రభుత్వంతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతులు పంట నష్టం నమోదును చేయించుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



దేవపూడిలో కామినేనికి సమస్యలు చెబుతున్న రైతులు

నష్టపోయిన అందరినీ ఆదుకుంటాం : మంత్రి



చెక్కపల్లి పెద్దచెరువును పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, సెప్టెంబరు 10: ముసునూరు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. చింతలవల్లి వద్ద సంధ్యవాగు కోతకుగురై వంతెన కూలి రహదారికి పడిన గండిని పరిశీలించారు. తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నష్టపోయిన ప్రతి రైతు, బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్గమధ్యంలో మంత్రి కాన్వాయిని ఆపి గోగులంపాడు గ్రామంలో సుమారు 3 వేల గొర్రెలు ఉన్నాయని, నట్టల నివారణ టీకాలను ఇప్పించాలని గొర్రెల కాపరులు మంత్రిని కోరగా మంత్రి జిల్లా కలెక్టర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, మందుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలను ప్రిన్సిపాల్ కె.ప్రవీణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.వంగిడియ్యలు మంత్రికి వివరించారు. చెక్కపల్లిలో ప్రమాదకరంగా ఉన్న పెద్ద చెరువుకట్టను మంత్రి పరిశీలించారు. పెద్ద చెరువు కట్ట శాశ్వత పటిష్టానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. చెరువుచుట్టూ ఉన్న ఆక్రమణలను తొలిగించే ప్రక్రియను చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ సలీంను ఆదేశించారు. అలాగే దెబ్బతిన్న రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌లు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం : కామినేని

కలిదిండి: ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పడమటిపాలెం, సున్నంపూడి గ్రామాల్లో పర్యటించి ముంపు బాధితులను పరామర్శించారు. అనంతురం బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం మద్వానిగూడెం వంతెన వద్ద ఉప్పుటేరును పరిశీలించారు. వంతెన కింద భాగంలో పలు ఖానాల్లో గుర్రపు డెక్క, తూడు దట్టంగా ఉండటంతో వరద నీటి ప్రవాహానికి అడ్డుపడుతుందని వెంటనే డెక్కను తొలగించాలని డ్రైనేజీ అధికారులను ఆదేశించారు. కొల్లేరు నుంచి వరదనీరు ఉప్పుటేరులోకి రావటంతో నీటి మట్టం పెరుగుతుందని తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలతో ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కొట్టాడలో పశువుల దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

కొల్లేరులో పశువుల దాణా పంపిణీ

25 టన్నుల దాణాను పంపిన ప్రభుత్వం

కైకలూరు, సెప్టెంబర్ 10: కొల్లేరు ముంపు ప్రాంతంలో ప్రజలతో పాటు పశుపక్ష్యాదులను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. మంగళవారం కైకలూరు మండలంలోని కొల్లేరు గ్రామాలకు 25 టన్నుల పశువుల దాణాను పంపిణీ చేశారు. గ్రామాలకు అందిన దాణాను ఏసురాజు ఆయా రైతులకు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. మండలంలోని పెంచికలమర్రు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులకు గతంలో 2020 సంవత్సరంలో కొల్లేరు ముంపునకు గురైనా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒక్క కేజీ దాణాను కూడా పశువులకు అందజేయలేదని అంతకంటే తక్కువ ముంపు ఉన్నా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పశువులను ఆదుకునేందుకు దాణాను అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో కొల్లేరు మరింత పెరుగుతుందని ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కొల్లేరు నాయకులు జయమంగళ సుబ్బరాజు, కైకలూరు పశువైద్యశాఖ ఏడీఏ ముస్తాఫా ఖాన్, పశువైద్యాధికారి ఫణీంద్ర, ఘంటశాల సుబ్బరాజు, నాగరాజు, ముంగర శ్రీనివాసరావు, జయమంగళ యువరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పెనుమాకలంకలో వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

వరదను పరిశీలించిన ఎమ్మెల్సీ జయమంగళ

మండవల్లి, సెప్టెంబరు 10: మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో వరద పరిస్థితిని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రభు త్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. జయమంగళతో పాటు మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్‌దుర్గాప్రసాద్, మండవల్లి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు, పెనుమాలంక మాజీ సర్పంచ్ ఘంటసాల వెంకటరాజు, తహసీల్దార్ గోపాల్, ఎంపీడీవో వెంకటరమణ, పలువురు కొల్లేటి గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సీనియర్ పాస్టర్ లాజరు మృతి



ముదినేపల్లి, సెప్టెంబరు 10 : సీనియర్ పాస్టర్, ముదినేపల్లికి చెందిన యడ్ల లాజరు (70) గుండెపోటుతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం మండలంలోని క్రైస్తవులు, పాస్టర్లను దిగ్భ్రాంతికి గురి చేసింది. గత 50 ఏళ్లుగా ముదినేపల్లి ప్రాంతంలోనే కాక ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో క్రీస్తు బోధనలు వినిపించారు. మృదు స్వభావిగా అందరి మన్ననలు పొందారు. మండల పాస్టర్ల సంఘ నాయకులు లాజరు భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన భార్య గతంలోనే మరణించగా, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

స్వచ్ఛ కోరుకొల్లే లక్ష్యం



కలిదిండి, సెప్టెంబరు 10 : కోరుకొల్లులో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలో డ్రైనేజీల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అంతర్గత రహదారులపై పేరుకున్న చెత్త కుప్పలు, బురదను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ స్వచ్ఛ భారత్ నిర్వహిస్తామని స్వచ్ఛ కోరుకొల్లుగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమన్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వర్ణకార సంఘం అన్నదానం

కైకలూరు, సెప్టెంబర్ 10: కైకలూరులో పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భిక్షాటన చేస్తున్న సాధువులకు మంగళవారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వాడపల్లి హిమకీర్తి పుట్టినరోజు సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నెలలో రెండు మంగళ వారాలు సాధువులకు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ టేకి సత్యనారా యణ తెలిపారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు అనుపోజు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వక్రతుండ మహాకాయ..

వైభవంగా గణపతి నవరాత్రులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 10: చలువ పందిళ్లలో గణనాథులు నాలుగో రోజు ప్రత్యేక పూజలు అందుకున్నారు. నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో పలు కూడళ్లలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పందిళ్లలో ప్రతిష్ఠించిన గణనాథులకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కమిటీలు వినూత్న రీతిలో లక్కీ డిప్‌లను ప్రకటించడం పలువుర్ని విశేషంగా ఆకర్షిస్తోంది.

ముదినేపల్లి: మండలంలో చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పెయ్యేరు కాలనీలో మంగళవారం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణతోపాటు దాకరం పీఏసీఎస్ మాజీ చైర్మన్ జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పూజలు జరిపారు. గురజ, పెదపాలపర్రు, ముదినేపల్లి, బొమ్మినంపాడు, సింగరాయపాలెం గ్రోవెల్ కంపెనీ వద్ద వినాయకుడి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

కలిదిండి: మండలంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయకుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే తాడినాడ, పోతుమర్రు, కొండంగి, మూల్లంక, భాస్కరరావుపేట, మట్టగుంట, పెదలంక గ్రామాల్లో నవరాత్రులు వైభవంగా నిర్వహించారు.



నూజివీడు మండపంలో కొలువైన గణనాథుడు

వరద బాధితులకు దుస్తుల వితరణ



కలిదిండి, సెప్టెంబరు 10 : కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో 1992-93లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం విజయవాడలో 1500 మంది వరద బాధితులకు దుస్తులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. పాము రవికుమార్, మోటుపల్లి సోమే శ్వరరావు, పచ్చిగోళ్ల ప్రసాద్, వి.దుర్గా ప్రసాద్, జి.రాంబాబు, సుబ్రహ్మణ్యం, ఎ. లక్ష్మి కె.భోగేశ్వరరావు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ

విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 10: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం పురస్కరించుకొని మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరు జిల్లా వైద్యాధికారిణి శర్మిష్ఠ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ పవిత్ర ఆత్మహత్యలకు ప్రేరేపించే కారణాలు, అపోహలు, మానసిక సమస్యలకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్ర కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా పోటీల్లో హీల్ విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 10: ఏలూరు అగ్రహారంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తోటపల్లిలోని హీల్ పారడైజ్ విద్యార్థులు 8 బంగారు, 3 రజత, 3 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. సాయిబాబు మాట్లాడుతూ తమ పాఠశాల తరపున 11 మంది బాలికలు, ఐదుగురు బాలురు పోటీల్లో పాల్గొనగా 11 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, పీడీలు పి.నాగరాజు, సీహెచ్ ప్రభుదాసు, ఉపాధ్యాయులు అభినందించారు.



ముంపులో కాలనీ (ఇన్‌సెట్) ఇంజన్‌తో నీరు తోడిస్తున్న దృశ్యం

చందాలు వేసుకుని మురుగు నీటి తొలగింపు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గన్నవరం రోడ్డులోని కాలనీలో ఏర్పడిన వర్షపు నీరు మురుగునీరుగా మారి బయటకు వెళ్ళటానికి కూడా దారిలేక దుర్గంధం వెదజల్లుతుండడంతో కాలనీవాసులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు చందాలు వేసుకుని ఇంజన్‌తో నీళ్ళు తోడించుకున్నారు.

వరదలకు వైసీపీనే కారణం : ముద్దరబోయిన

నూజివీడు, సెప్టెంబరు 10: వైసీపీ పతనం ప్రారంభమై ఏడాది పూర్తయిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నూజివీడులో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అనుభవాన్ని తన పాలనలో ఉపయోగించుకోవాల్సిన జగన్ అందుకు విరుద్ధంగా ఆయనపై అక్రమ కేసులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చేసిన యత్నం వికటించిందన్నారు. ఫలితంగా కేవలం 11 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. ఇసుక బోట్లతో ప్రకాశం బ్యారేజ్ గేట్లను వైసీపీ ఢీ కొట్టించి విద్రోహ చర్యకు పాల్పడిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వైసీపీ హయాంలో చెరువులు, ప్రాజెక్టులు, పంట కాలువల నిర్వహణను గాలికి వదిలివేయటం వల్లే నేడు విజయవాడ ముంపునకు కారణమన్నారు.

తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదికలు ఇవ్వండి



చాట్రాయి, సెప్టెంబరు 10: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో వాటిల్లిన నష్టంపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు ఇవ్వాలని మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం కోరారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయిలో వ్యవసాయం, రోడ్లు, ఇరిగేషన్, విద్యుత్, పాఠశాలలు, భవనాలు, పేదల గృహాలు మొదలైన వాటికి జరిగిన నష్టంపై వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్, డీటీ ఈశ్వరరావు, ఎంఈవో బ్రహ్మాచారి, ఏవో శివశంకర్, ఈవోపీఆర్డీ నాగరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో రోగాలు దూరం

చాట్రాయి, సెప్టెంబరు 10: ప్రతి ఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని హెచ్ఎం వెంకట్రావు అన్నారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని వివరించారు. ఎస్ఎంసీ చైర్మన్ షేక్ హసీనా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య సమాజం



చాట్రాయి, సెప్టెంబరు 10: పౌష్టికాహారంతో ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీవో నూరానీ అన్నారు. చాట్రాయి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన పౌష్టికాహార మాసోత్సవంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే తద్వారా బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని అన్నారు. చిరుధాన్యాలు, స్థానికంగా తక్కువ ధరలకు దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవటం వల్ల శరీరానికి సమతుల ఆహారం అంది ఆరోగ్యంగా జీవించవచ్చునని అన్నారు. పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. రెండేళ్లలోపు వయస్సున్న పిల్లల తల్లులు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని కోరారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గాయత్రీదేవి, రమాదేవి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.